క్లుప్తంగా

వృద్ధులకు దుప్పట్లు పంపిణీ

మదనపల్లె సిటీ : స్థానిక ఆర్టీసీ బస్టాండులో వృద్ధులు, యాచకులకు లయన్స్ అభయ ఆధ్వర్యంలో దుప్పట్లు పంపిణీ చేశారు. లయన్స్ అభయ ప్రెసిడెంట్ సుధాకర్‌రెడ్డి మాట్లాడుతూ ఇటీవల కురుస్తున్న వర్షాలకు పేదలు, వృద్ధులు చలికి తీవ్రంగా ఇబ్బందులు పడుతున్నట్లు తెలిపారు. సామాజిక సేవా కార్యక్రమంలో భాగంగా దుప్పలు అందజేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో దేశాయ్ జయదేవరెడ్డి, శేఖర్‌రెడ్డి, శివకుమార్‌రెడ్డి, గిరిధర్ రెడ్డి, రామమూర్తి, ప్రభాకర్‌రెడ్డి పాల్గొన్నారు.

దిక్సూచి కరదీపిక ఆవిష్కరణ

మదనపల్లె సిటీ : ఆంధ్రప్రదేశ్ ఫిజికల్ సైన్స్ టీచర్స్ ఫోరం రాష్ట్ర రిసోర్సు గ్రూపుచే రూపొందించిన పదవ తరగతి నూతన పాఠ్యపుస్తకం ఆధారంగా దిక్సూచి కరదీపికను డిడీవైఈఓ కార్యాలయంలో శనివారం డీవైఈఓ శ్రీరాం పురుషోత్తం ఆవిష్కరించారు. ఈ దిక్సూచి వెనుకబడిన పిల్లలు మంచి మార్కులు ఫిజికల్ సైన్సులో పొందడానికి ఉపయోగపడుతుందనారు. ఏ గ్రేడ్ పిల్లలకు మంచి మార్గ నిర్దేశకంగా ఉండి, మంచి గ్రేడ్ సంపాదించడానికి ఉపయోగపడుతుందన్నారు. కార్యక్రమంలో జిల్లా ఫిజికల్ సైన్సు ఫోరం అధ్యక్షులు ఎం.భాస్కరన్, కోశాధికారి పిఎల్ఎన్ శాస్త్రి,జగన్‌రెడ్డి, భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు సౌకర్యం కల్పించాలి

తంబళ్లపల్లె : మండల కేంద్రంలోని టీఎన్ జయసూర్యరెడ్డి కాలనీకి రోడ్డు సౌకర్యం కల్పించాలని కాలనీవాసులు కోరారు. ఈవిషయమై శనివారం ఎంపీడీఓ ఉపేందర్‌రెడ్డికి వినతిపత్రం అందజేశారు. నూతనంగా ఏర్పడిన కాలనీలో పలువురు నివాసాలు ఉంటున్నారన్నారు. మరికొందరు ఇంటి నిర్మాణాలు చేసుకుంటున్నారన్నారు. ఈ కాలనీకి పక్కా రోడ్డు, తాగునీరు, విద్యుత్ సరఫరా,మౌళిక వసతులు కల్పించాలని రెడ్డప్పరెడ్డి, మస్తాన్, మంజునాథరెడ్డి, నారాయణరెడ్డి,ఈశ్వరప్ప తదితరులు కోరారు.

లోక్‌అదాలత్‌ను విజయవంతం చేయండి

పీలేరురూరల్ : డిసెంబర్ 14న నిర్వహించనున్న జాతీయ లోక్ అదాలత్‌ను విజయవంతం చేయాలని జిల్లా 11వ అదనపు జడ్జి ఎ. మహేష్ అన్నారు. శనివారం ఏడీజే కోర్టులో న్యాయవాదులకు, పోలీసులకు సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జడ్జి మాట్లాడుతూ దీర్ఘకాలికంగా పరిష్కారం కాని కేసులు కక్షి దారులు లోక్‌అదాలత్‌ను సద్వినియోగం చేసుకుని పరిష్కరించుకోవాలన్నారు. మోటారు వాహన ఎక్కువ అవుతున్నాయని, వాటిని అరికట్టాలన్నారు. ఎక్కువ కేసులు పరిష్కారం అయ్యేలా చూడాలని సూచించారు. సీనియర్ సివిల్ జడ్జి కె.రవి, న్యాయవాదులు, పోలీస్ అధికారులు పాల్గొన్నారు.

హాస్టళ్లలో మెనూ పాటించాలి

– న్యాయమూర్తి ఉమర్‌ఫరూఖ్

తంబళ్లపల్లె : ప్రభుత్వ హాస్టళ్లలో మెనూ తప్పక పాటించాలని మండల న్యాయసేవా అధికార సంఘం చైర్మన్, స్థానిక న్యాయమూర్తి ఉమర్ ఫరూఖ్ సూచించారు. శనివారం మోడల్ స్కూల్ బాలికల హాస్టల్‌ను తనిఖీ చేశారు. బాలికలకు వంట గదిని, వసతి సౌకర్యాలు, పరిశుభ్రత తదితర అంశాలపై పరిశీలించారు. రాత్రి వేళ పోలీసుగస్తీ ఏర్పాటుపై వార్డన్ బుజ్జమ్మ న్యాయమూర్తి దృష్టికి తీసుకెళ్లారు.

మన పరిసరాలను మనమే శుభ్రం చేసుకుందాం

– జూనియర్ సివిల్ కోర్టు జడ్జి గురు అరవింద్

వాల్మీకిపురం : మన చుట్టు ఉన్న పరిసరాలను మనం శుభ్రంగా ఉంచుకోవడం ద్వారా మనతో పాటు చుట్టూ ఉన్నవారు కూడా ఆరోగ్యంగా జీవించవచ్చునని వాల్మీకిపురం జూనియర్ సివిల్ కోర్టు జడ్జి గురు అరవింద్ అన్నారు. స్వచ్ఛతా హీ సేవా కార్యక్రమంలో భాగంగా శనివారం స్థానిక కోర్టు ఆవరణంలో శుభ్రత కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా జడ్జి మాట్లాడుతూ పరిసరాలను శుభ్రంగా ఉంచుకొని, కార్యాలయాలు, ఇండ్ల పరిసర ప్రాంతాల్లో మురుగునీరు నిల్వ లేకుండా చూసుకోవాలన్నారు. అలాగే ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి వాటిని సంరక్షించాలన్నారు. ఈ కార్యక్రమంలో న్యాయవాదులు ఆనంద్ కుమార్, రమణారెడ్డి, రవి ప్రకాష్, సిబ్బంది పాల్గొన్నారు.

ప్రతి గ్రామాన్ని అభివృద్ధి చేస్తాం

రామసముద్రం : నియోజకవర్గంలోని ప్రతి గ్రామాన్ని అభివృద్ధి చేయడమే ధ్యేయమని ఎమ్మెల్యే షాజహాన్‌బాషా తెలిపారు. శనివారం ఆయన మండలంలోని అన్ని గ్రామ పంచాయతీల్లో సీసీ రోడ్ల నిర్మాణానికి భూమి పూజ చేసి చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ తాను ఎమ్మెల్యేగా ఉన్నప్పుడు మండలాన్ని అన్ని విధాలుగా అభివృద్ధి చేసే అవకాశం దక్కిందని తెలిపారు. మండలంలో రూ.1.50 కోట్లతో 4.22 కిలో మీటర్ల దూరం 47 సీసీరోడ్లు వేస్తున్నట్లు తెలిపారు. రూ.2.7 కోట్లతో 5.2 కిలో మీటర్ల టూరిజం రోడ్లు వేస్తున్నట్లు చెప్పారు. గ్రామీణ ప్రజలకు అవసరమైన సౌకర్యాలు కల్పించి, అభివృద్ధి వైపు అడుగులు వేస్తామన్నారు. ఇంకా అవసరమైన చోటికి సీసీ రోడ్లు , మురుగునీటి కాలువలు నిర్మిస్తామన్నారు. ఎంపీడీవో భానుప్రసాద్, ఏఈ మస్తాన్, ఏపీవో గౌరిశంకర్, పాల్గొన్నారు.

ప్రారంభమైన ఉరుసు ఉత్సవాలు

ములకలచెరువు: స్థానిక మండల కేంద్రంలోని కదిరి రోడ్డులో వెలసిన మహబూబ్ సుభానీ దర్గా ఉరుసు ఉత్సవాలు దీపోత్సవంతో శనివారం ఘనంగా ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా దర్గా పరిసర ప్రాంతాలను విద్యుత్ దీపాలతో ప్రత్యేకంగా అలంకరించారు. అనంతరం గంధం, అన్నదాన కార్యక్రమం నిర్వహించారు.

ముదిరెడ్డిగారిపల్లె రోడ్డుకు

మోక్షం ఎప్పుడో..?


ముదిరెడ్డిగారిపల్లెలో ఇళ్ల ముందు బురదతో నిండిన రోడ్డు


బుచ్చిరెడ్డిగారిపల్లె నుంచి ముదిరెడ్డిగారిపల్లెకు వెళుతున్న రోడ్డు

- కాళ్లు అరిగేలా తిరిగినా పట్టించుకోని అధికారులు, నాయకులు
- బురదమయమైన రోడ్డులో నరకయాతన
- ఎస్సీ, ఎస్టీ కాలనీలపై చిన్నచూపా?
- ఎమ్మెల్యే స్పందించాలంటున్న గ్రామస్తులు

నిమ్మనపల్లె : గ్రామాల అభివృద్ధి తమ లక్ష్యం అంటూ ఒకపక్క కూటమి ప్రభుత్వం, ఉప ముఖ్యమంత్రి, పంచాయతీరాజ్, గ్రామీణ అభివృద్ధి శాఖ మంత్రి కొణిదెల పవన్ కళ్యాణ్ అంటుంటే మరోపక్క గ్రామాలలో అటు అధికారులు కానీ, ఇటు ప్రజాప్రతినిధులు అందుకు భిన్నంగా వ్యవహరిస్తున్నారని గ్రామీణ ప్రజలు వాపోతున్నారు. ఒకవైపు పల్లె పండగకు ప్రభుత్వం సిద్ధమవుతుంటే, మరోపక్క తమ గ్రామాల గోడును పట్టించుకోవాలని పల్లె జనం వేడుకుంటున్నారు. అందుకు నిదర్శనంగా నిమ్మనపల్లె పంచాయతీ ఎస్సీ నివాస ప్రాంతం ముదిరెడ్డిగారిపల్లె (గూడుపల్లె) నిలుస్తోంది .

వివరాల్లోకి వెళితే... మండలంలోని నిమ్మనపల్లె పంచాయతీ ముద్దిరెడ్డిగారి పల్లెలో ఎస్సీ వర్గానికి చెందిన ప్రజలు అధికంగా నివసిస్తున్నారు. అధికంగా వ్యవసాయంపై ఆధారపడి జీవిస్తున్నారు తమ వ్యవసాయ ఉత్పత్తులను నిమ్మనపల్లి, మదనపల్లికు తరలించడానికి ప్రజలు రాకపోకలు సాగించడానికి ఉన్న ఒకేఒక్క రోడ్డు గుంతలు, కంకర తేలి, వర్షం పడితే బురద మయమై, కనీసం నడిచి వెళ్లే పరిస్థితి లేక తీవ్ర అసౌకర్యం కలిగిస్తోంది. ద్విచక్ర వాహన దారులు తరచూ ప్రమాదాలకు గురవుతున్నారు. ముదిరెడ్డిగారి పల్లెకు సరైన రోడ్డు సౌకర్యం లేక ప్రజలు నిత్యం అనేక సమస్యలు ఎదుర్కొంటున్నారు. సిమెంటు రోడ్డు కానీ, తారు రోడ్డు అయినా వేయాలని గత కొన్ని ఏళ్లగా అధికారులు, ప్రజా ప్రతినిధులకు వినతి పత్రాలను ఇస్తున్నా ఎవరూ పట్టించుకోకుండా ఇదిగో అదిగో అంటూ కాలయాపన చేస్తున్నారని స్థానికులు వాపోయారు. ప్రభుత్వం ప్రత్యేకంగా ఎస్సీ, ఎస్టీ నివాస ప్రాంతాలలో రోడ్లు, తాగునీరు, విద్యుత్, మురుగునీటి కాలువలు వంటి మౌలిక సదుపాయాలను ఏర్పాటు చేయాల్సి ఉన్నా స్పందించకపోవడం దురదష్టం అంటున్నారు. గత మూడు రోజులుగా కురిసిన వర్షానికి పల్లెలోని ఇళ్ళ ముందర సైతం రోడ్లు మొత్తం బురదమయంతో నిండిపోయి అడుగుపెడితే క్రింద పడే పరిస్థితి ఏర్పడింది. కనీసం ఇప్పటికైనా ఎమ్మెల్యే ప్రత్యేక చొరవ తీసుకొని సమస్య పరిష్కరించాలని గ్రామస్తులు కోరుతున్నారు.

కొన్నేళ్లుగా రోడ్డులేక అవస్థలు



చాలాకాలంగా ముదిరెడ్డిగారిపల్లెకు సరైన రోడ్డు సౌకర్యం లేక ఇబ్బందులు పడుతున్నాంము. వర్షాలు పడితే, కనీసం అడుగుపెట్టలేని దుస్థితిలో రోడ్డు ఉంటోంది. ఈ రోడ్డులో వ్యవసాయ ఉత్పత్తులు తరలించడం కష్టమవుతోంది. అధికారులు స్పందించి రోడ్డు సౌకర్యం కల్పిస్తే బాగుంటుంది.
– గంగులప్ప, ముదిరెడ్డిగారిపల్లె

ప్రతిపాదనలు పంపించాం



ముదిరెడ్డిగారిపల్లెకు రోడ్డు సౌకర్యం కల్పించాలని గ్రామస్తులు చేసిన వినతి మేరకు ప్రతిపాదనలు తయారు చేశాం. 1.5 కి.మీ. మేర రోడ్డు నిర్మాణానికి దాదాపుగా రూ.1కోటి43 లక్షలతో ఇంజినీరింగ్ అధికారులతో నివేదికలు తయారు చేయించి, ప్రభుత్వానికి అందజేశాం. పనులు మంజూరైన వెంటనే రోడ్డు నిర్మాణం పూర్తి చేస్తాం.
– పరమేశ్వరరెడ్డి, ఎంపీడీఓ, నిమ్మనపల్లె

వలంటీర్ల వ్యవస్థను కొనసాగించాలి

21న వలంటీర్ల ఆందోళనకు ఏఐటీయూసీ సంఘీభావం



మాట్లాడుతున్న ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి సాంబశివ

మదనపల్లె : ఎన్నికల ప్రచారంలో భాగంగా ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు వలంటీర్లకు రూ.10వేల వేతనంతో పాటు, వ్యవస్థను కొనసాగిస్తామని హామీ ఇచ్చారు. తక్షణమే అమలు దిశగా చర్యలు తీసుకోవాలని ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి సాంబశివ డిమాండ్ చేశారు. శనివారం స్థానిక ఏఐటీయూసీ కార్యాలయంలో ఏఐటీయూసీ ముఖ్యనాయకుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సాంబశివ మాట్లాడుతూ..రాష్ట్రవ్యాప్తంగా ఉన్నటువంటి 2లక్షల 60వేల మంది వలంటీర్లను కొనసాగించాలని, ఈనెల 21వతేదీ సోమవారం జిల్లా కలెక్టరేట్ వద్ద వలంటీర్లు చేపట్టనున్న ఆందోళనకు ఏఐటీయూసీ తరపున సంఘీభావం తెలుపుతున్నామన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి నాలుగునెలలు పూర్తి అయినప్పటికీ, ఇప్పటివరకు వలంటీర్లకు వేతనాలు ఇవ్వలేదన్నారు. వలంటీర్లను టీడీపీ ప్రభుత్వం కొనసాగిస్తుందా..లేదా అనే విషయమై స్పష్టత ఇవ్వకపోవడం, బకాయి వేతనాలు చెల్లించకపోవడంతో వారు ఆందోళనకు గురవుతున్నారన్నారు. తక్షణమే కూటమి నాయకులు ఇచ్చిన హామీలను అమలుచేసి వలంటీర్లకు న్యాయం చేయాలన్నారు. కరోనా సమయంలో ప్రాణాలకు తెగించి వలంటీర్లు అందించిన సేవలు మరువలేనివన్నారు. పలుకారణాలతో గతంలో రాజీనామా చేసిన వలంటీర్లను తిరిగి విధుల్లోకి తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో ఏఐటీయూసీ పట్టణ కార్యదర్శి తిరుమల, భవననిర్మాణ కార్మికసంఘం నాయకులు మురళీ, వెంకటరమణ, ఆటోవర్కర్స్ యూనియన్ నాయకులు రవి తదితరులు పాల్గొన్నారు.

జానం గంగిరెడ్డికి గౌరవ డాక్టరేట్



పీలేరు : పీలేరుకు చెందిన జానం గంగిరెడ్డికి గౌరవ డాక్టరేట్ లభించింది. అక్కినేని నాగేశ్వరరావు శతశయంతి ఉత్సవాల్లో భాగంగా హైదరాబాదు హిమాయత్ నగర్‌లోని అల్లైడ్ ఆర్టిస్ట్ ఆడిటోరింలో శుక్రవారం ఫ్రెండ్షిఫ్ మినిస్ట్రీస్ ఆధ్వర్యంలో వివిధ రంగాలకు సంబంధించి డాక్టరేట్‌లు ప్రదానం చేశారు. ఇందులో భాగంగా వివిధ సేవా రంగాల్లో రాణించిన జానం గంగిరెడ్డికి గౌరవ డాక్టరేట్‌ను ప్రముఖులు ప్రదానం చేశారు.

ఓపెన్ టెన్త్, ఇంటర్ పరీక్షలకు దరఖాస్తు గడువు పెంపు

మదనపల్లె సిటీ : ఓపెన్ టెన్త్, ఇంటర్ పరీక్షలకు దరఖాస్తు గడువును ఈనెల 25వతేదీ వరకు పొడగించినట్లు ఓపెన్ స్కూల్ స్టడీ సెంటర్ అసిస్టెంట్ కో ఆర్డినేటర్ పఠాన్ మహమ్మద్‌ఖాన్ తెలిపారు. శనివారం ఆయన విలేకర్లతో మాట్లాడుతూ వివిధ కారణాల వల్ల మధ్యలో చదువు మానేసిన విద్యార్థులు అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఇందులో భాగంగా ఆదివారం స్థానిక జెడ్పీ ఉన్నత పాఠశాలలో స్పాట్ అడ్మిషన్లు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. మరిన్ని వివరాలకు 8121852786ను సంప్రదించాలన్నారు.

ఎయిడ్స్ నివారణపై అవగాహన

పీలేరు : హెచ్ఐవీ / ఎయిడ్స్ నివారణపై అవగాహన అవసరమని కోర్ సంస్థ ప్రతినిధి రాజమ్మ అన్నారు. శనివారం స్థానిక కోటపల్లె జెడ్పీ ఉన్నత పాఠశాలలో హెచ్ఐవీ /ఎయిడ్స్ నివారణపై అవగాహన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ హెచ్ఐవీని ప్రారంభ దశలో గుర్తిస్తే తగు జాగ్రత్తలు తీసుకోవచ్చునని తెలిపారు. హెచ్ఐవీ బాధితులను సమాజంలో చిన్నచూపు చూడరాదన్నారు. పాఠశాల సిబ్బంది రామచంద్రనాయుడు, శేషాద్రిరెడ్డి, వెంకటరెడ్డి, వసంతకుమారి పాల్గొన్నారు.

సమాజ సేవకు కృషి చేయాలి

బి.కొత్తకోట : స్థానిక దారుల్ తౌహిద్ మసీదులో శుక్రవారం రాత్రి ఇజతిమా కార్యక్రమం జరిగింది. ఒంగోలుకు చెందిన మత గురువు మొహమ్మద్ సలీమ్ దాయీ మాట్లాడుతూ ప్రతిఒక్కరూ సోదర భావంతో మెలుగుతూ సమాజసేవకు కృషి చేయాలని కోరారు. పేదలకు సహాయం చేయ డం బాధ్యతగా భావించాలన్నారు. రిటైర్డ్ హెచ్ఎం ఖాదర్‌వలీ, షేక్ దాయీ యాహ్యా, సయ్యద్‌బాషా మాట్లాడారు. కార్యక్రమంలో ప్రసంగించిన పిల్లలకు బహుమతులు అందించారు.

పోషకాల ఆకులపై వేడుక

బి.కొత్తకోట : అత్యంత పోషకాలు కలిగి, ఎన్నో ఆరోగ్య సమస్యలకు పరిష్కారమైన ఆకులపై శనివారం ఐసీడీఎస్ ఆధ్వర్యంలో స్థానిక అంగన్‌వాడీ కేంద్రంలో వేడుక నిర్వహించారు. ఏఏ ఆకులతో ఎలాంటి సమస్యలు పరిష్కారం అవుతాయి, వాటిని ఎలా వినియోగించుకోవాలి అన్నదానిపై ప్రదర్శన కూడా నిర్వహించారు. వేడుకకు హాజరై బాలింతలు, గర్భిణులేకాక వారి తల్లిదండ్రులను కూడా రప్పించారు. వారిలో అవగాహన కల్పించి ఆకుల వినియోగం పెంచాలని ప్రయత్నం చేశారు. ఈ సందర్భంగా ఐసీడీఎస్ బి.కొత్తకోట ప్రాజెక్టు సీడీపీఓ కే.భాగ్యమ్మ, సూపర్‌వైజర్ జి.జయరాణి మాట్లాడుతూ కరివేపాకు, మునగాకు, అవిసే ఆకుల్లో అత్యధిక ప్రోటీన్లు, కాల్షియం ఉంటుందన్నారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ కార్యకర్తలు, ఆశావర్కర్లుమ పాల్గొన్నారు.

మునగాతో ప్రయోజనాలు మెండు

వాల్మీకిపురం : ప్రతి ఒక్కరూ మునగాకు తినవడం వలన మన శరీరానికి కావాల్సిన పలు విటమిన్లు లభిస్తాయని ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు అరుంధతి, రోహిణి తెలిపారు. శనివారం మండలంలోని దాసరివారిపల్లి, చింతపర్తి, వాల్మీకిపురం పట్టణంలోని కుమ్మరవీధి అంగన్‌వాడీ కేంద్రాల్లో మునగాకుపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గర్భిణులు, బాలింతలు మునగాకు తినడం వలన 32 రకాల ఆరోగ్య ప్రయోజనాలు ఉంటాయన్నారు.

రాయలసీమ కాపు, బలిజల కోసం హెల్ప్‌లైన్



హెల్ప్‌లైన్ యూనిట్ ఏర్పాటుకు సంబంధించి వివరాలు తెలుపుతున్న కాపునాయకులు


మదనపల్లె : శ్రీ కృష్ణదేవరాయల కాపు సేవాలయ సొసైటీ ఆధ్వర్యంలో రాయలసీమలోని కాపు, బలిజల కోసం ఉచిత హెల్ప్‌లైన్ యూనిట్‌ను ఏర్పాటు చేస్తున్నట్లు ఫౌండర్స్ టీఎస్.నరసయ్య, పవన్‌తేజ తెలిపారు. పట్టణంలోని బలిజ సంఘాల నాయకులతో కలిసి శనివారం ప్రెస్‌క్లబ్‌లో మీడియా సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ...రాయలసీమలోని 56 నియోజకవర్గాల్లో లక్షల సంఖ్యలో ఉన్న బలిజలు...ఉద్యోగాలు, ఆరోగ్యం, వివాహం, విదేశీవిద్య, చదువు, వ్యాపారం తదితరాలకు సంబంధించి ఏవేని ఇబ్బందులుంటే హెల్ప్‌లైన్ యూనిట్‌ను సంప్రదించి పరిష్కారం పొందవచ్చన్నారు. కార్యక్రమంలో బలిజ సంఘాల నాయకులు జంగాల శివరాం, ప్రసాద్, ఆంజనేయులు, చంద్రశేఖర్, నిరుపమ తదితరులు పాల్గొన్నారు.

కాంట్రాక్టు లెక్చరర్లను క్రమబద్ధీకరించాలి

నిమ్మనపల్లె : ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో పనిచేస్తున్న కాంట్రాక్ట్ లెక్చరర్లను క్రమబద్ధీకరించాలని నిమ్మనపల్లె ప్రభుత్వ జూనియర్ కళాశాల కాంట్రాక్ట్ అధ్యాపకులు శనివారం భోజన విరామసమయంలో కళాశాల ఎదుట నిరసన వ్యక్తం చేశారు. పసుపురంగు రిబ్బన్లు ధరించి విధులకు హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... రాష్ట్రంలో 3,618 మంది కాంట్రాక్ట్ లెక్చరర్లు పనిచేస్తున్నారన్నారు. 2014లో టీడీపీ ప్రభుత్వం అధికారంలోకి రాగానే కాంట్రాక్ట్ లెక్చరర్ల క్రమబద్ధీకరణకు చర్యలు చేపట్టి మంత్రివర్గ ఉపసంఘాన్ని నియమించారన్నారు. అయితే చివరిదశలో అధికారుల సాంకేతిక కారణాలను సాకుగా చూపి ఎటూ తేల్చకుండా వదిలేశారన్నారు. నిరసన తెలిపిన వారిలో రెడ్డెప్ప, ఇలియాజ్, హరినారాయణ్, షాహీనాపర్వీన్, కృష్ణమూర్తి, రాజామణి శెట్టి, రాజ్‌కుమార్, రామాంజనేయులు పాల్గొన్నారు.

వాల్మీకిపురం : ఒప్పంద అధ్యాపకులను క్రమబద్ధీకరించాలని వాల్మీకిపురం పీవీసీ ప్రభుత్వ జూనియర్ కళాశాల ఒప్పంద అధ్యాపకులు డిమాండ్ చేశారు. శనివారం స్థానిక కళాశాలలో పసుపు రిబ్బన్‌లు ధరించి విధులకు హాజరై నిరసన తెలిపారు.ఈ సంద్భంగా వారు మాట్లాడుతూ గత ప్రభుత్వం క్రమబద్ధీకరణకు వివిధ కమిటీలు వేసి కాలయాపన చేసిందన్నారు.

విద్యార్థులకు కన్నీటి వీడ్కోలు


అజయ్‌కుమార్‌రెడ్డి మృతదేహం వద్ద తల్లడిల్లుతున్న తల్లి, చెల్లి


యశ్వంత్‌రెడ్డి మృతదేహం వద్ద విలపిస్తున్న బంధువులు

మృతులకు ఎమ్మెల్యే నివాళి

తంబళ్లపల్లె : కళాశాల నుంచి ద్విచక్రవాహనంలో ఇంటికి వస్తూ కురబలకోట మండలం దాదంవారిపల్లె సమీపంలో ఎదురుగా వస్తున్న ఆర్టీసీ బస్సుకు ఢీ కొని ఇద్దరు విద్యార్థులు శుక్రవారం సాయంత్రం అక్కడికక్కడే మృతి చెందిన విషయం పాఠకులకు తెలిసిందే. మండలంలోని గుండ్లపల్లె పంచాయతీ మలిగివారిపల్లెకు చెందిన సుబ్బారెడ్డి, శ్రీదేవి దంపతుల కుమారుడు అజయ్ కుమార్‌రెడ్డి (19), చెట్లవారిపల్లెకు చెందిన వెంకటరెడ్డి, సుమిత్ర దంపతుల కుమారుడు యశ్వంత్‌రెడ్డి (19) శుక్రవారం సాయంత్రం రోడ్డు ప్రమాదానికి గురై మృతి చెందారు. మదనపల్లె జిల్లా ఆస్పత్రిలో మృతదేహాలకు పోస్టుమార్టం నిర్వహించి ముదివేడు ఎస్.ఐ దిలీప్ కుమార్ మృతదేహాలను కుటుంబ సభ్యులకు అప్పగించారు. శనివారం మధ్యాహ్నం మృతదేహాలను స్వగ్రామాలకు తీసుకువచ్చారు. ఒక్కసారిగా మలిగివారిపల్లె, చెట్లవారిపల్లెలు శోకసముద్రంగా మునిగిపోయాయి. ఎమ్మెల్యే పెద్దిరెడ్డి ద్వారకనాథరెడ్డి రెండు గ్రామాలకు వెళ్లి మృతదేహాలకు నివాళులు అర్పించారు.

రికార్డులు పక్కాగా ఉండాలి

స్పెషల్ డిప్యూటీ కలెక్టర్


రికార్డులను పరిశీలిస్తున్న స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ రాఘవేంద్ర

పెద్దతిప్పసముద్రం : ఫ్రీ హోల్డ్ భూములకు సంబంధించి రికార్డులు పక్కాగా ఉండాలని హెచ్ఎన్ఎస్ఎస్ స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ రాఘవేంద్ర రెవెన్యూ అధికారులను ఆదేశించారు. శనివారం ఆయన స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో వీఆర్వోలు తయారు చేస్తున్న ఫ్రీ హోల్డ్ భూముల రికార్డులను పరిశీలించారు. ఈ సందర్భంగా డిప్యూటీ కలెక్టర్ మాట్లాడుతూ కార్యాలయంలోని పురాతన కాలం నాటి రికార్డులను, రైతుల వద్ద ఉన్న భూముల వివరాలతో కూడుకున్న పత్రాలను క్షుణంగా పరిశీలించాలన్నారు. అంతేగాక రిజిస్టర్ అయిన ఫ్రీ హోల్డ్ భూముల రికార్డులను కూడా పరిశీలించాలన్నారు. వీఆర్వోలు విధుల పట్ల అలసత్వం వీడి సమగ్రమైన ఆధారాలతో కూడుకున్న ఈ ప్రక్రియను నెలాఖరులోగా పూర్తి చేయాలని ఆదేశించారు.

రాష్ట్రస్థాయి పోటీలకు విద్యార్థుల ఎంపిక


రాష్ట్రస్థాయి ఫెన్సింగ్ పోటీలకు ఎంపికైన విద్యార్థులు

గుర్రంకొండ : రాష్ట్రస్థాయి ఫెన్సింగ్ పోటీలకు గుర్రంకొండకు చెందిన తెలుగు జెడ్పీహైస్కూల్ విద్యార్థులు ఎంపికైనట్లు పీడీ చింతిర్ల రమేష్ శనివారం తెలిపారు. ఉమ్మడి చిత్తూరు జిల్లా యాదమరి జెడ్పీ హైస్కూల్ గ్రౌండ్‌లో జిల్లా ఫెన్సింగ్ జట్టు ఎంపిక పోటీలు నిర్వహించారు. ఈ పోటీల్లో మంచి ప్రతిభ కనబరిచి అండర్–14విభాగంలో ముజాహిద్, సంతోష్, అండర్–17 విభాగంలో ప్రసన్నకుమార్, భాను ప్రసాద్‌లు జిల్లా జట్టుకు ఎంపికయ్యారు. వీరు ఈనెల 20 నంచి నంద్యాలలోని స్టేడియంలో జరగబోయే రాష్ట్రస్థాయి ఫెన్సింగ్ పోటీల్లో పాల్గొంటారని ఆయన పేర్కొన్నారు. గుర్రంకొండ విద్యార్థులు వరుసగా మూడవ ఏడాది రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపిక కావడం గమనార్హాం. కాగా శనివారం స్థానిక తెలుగు జెడ్పీ హైస్కూల్లో ఏర్పాటు చేసిన ఓ కార్యక్రమంలో ఖేలో ఇండియా కోచ్ రవీంద్ర, జిల్లా స్కూల్‌గేమ్స్ కార్యదర్శి వసంత, హెడ్మాస్టర్ అహ్మద్‌బాషా విద్యార్థులను అభినందించారు.

సీజనల్ వ్యాధులపై అవగాహన కల్పించాలి

డీఎంహెచ్ఓ డాక్టర్ కొండయ్య


చింతపర్తి పీహెచ్‌సీని తనిఖీ చేస్తున్న డీఎంహెచ్ఓ డాక్టర్ కొండయ్య

వాల్మీకిపురం : గ్రామీణ ప్రాంతల్లో సీజనల్ వ్యాధులపై విరివిగా అవగాహన సదస్సులు నిర్వహించాలని అన్నమయ్య డీఎంహెచ్ఓ డాక్టర్ కొండయ్య అన్నారు. శనివారం మండలంలోని చింతపర్తి పీహెచ్‌సీని ఆయన తనిఖీ చేశారు. ఈ సందర్భంగా రికార్డులను పరిశీలించి, సిబ్బంది పనితీరుపై ఆరా తీశారు. ఆయన మాట్లాడుతూ వైద్యులు ప్రజలు అందుబాటులో ఉండి మెరుగైన వైద్య సేవలు అందించాలన్నారు. వర్షాల అనంతరం అంటువ్యాధులు ప్రబలే అవకాశం ఉన్నందున ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. పంచాయతీ సహకారంతో ఓవర్ హెడ్ ట్యాంక్‌లు శుభ్రం చేయించి క్లోరినేషన్ చేయించాలన్నారు. పిహెచ్‌సిల్లో ప్రతి నెలా పది కాన్పులు అయ్యేలా చర్యలు తీసుకోవాలన్నారు. పాము, కుక్క కాటు మందులు, అత్యవసర మందులు అందుబాటులో ఉంచుకోవాలని సిబ్బందిని ఆదేశించారు. కార్యక్రమంలో డిప్యూటీ డీఎంహెచ్ఓ డాక్టర్ రమేష్ బాబు, డాక్టర్ శ్రీవిద్య, సిబ్బంది పాల్గొన్నారు.

మానవ అక్రమరవాణా దుర్మార్గపు చర్య



విద్యార్థినికి సర్టిఫికెట్లు ప్రదానం చేస్తున్న కరెస్పాండెంట్ నాగమల్లయ్య, రీడ్‌ సంస్థ ప్రధాన కార్యదర్శి ఈశ్వరయ్య

గుర్రంకొండ : మానవ అక్రమ రవాణా ఓ దుర్మార్గపు చర్య అని రీడ్ సంస్థ ప్రధాన కార్యదర్శి ఐలా ఈశ్వరయ్య, ఎస్వీ డిగ్రీ కళాశాల కరెస్పాండెంట్ నాగమల్లయ్య అన్నారు. శనివారం గుర్రంకొండలో స్థానిక ఎస్వీ డిగ్రీ కళాశాల వద్ద నుంచి రీడ్ సంస్థ ఆధ్వర్యంలో విద్యార్థులు ర్యాలీ, మానవహారం నిర్వహించారు. ఈసందర్భంగా కళాశాలలో పోస్టర్లను ఆవిష్కరించి విద్యార్థులకు సర్టిఫికెట్లు ప్రదానం చేశారు. అనంతరం కళాశాలలో ఏర్పాటు చేసిన అవగాహన సదస్సులో వారు మాట్లాడారు. కార్యక్రమంలో హెడ్మాస్టర్ వేణుగోపాల్, సిబ్బంది పాల్గొన్నారు.

మదనపల్లె సిటీ : మావవ అక్రమ రవాణా లేని సమాజ స్థాపనకు కృషి చేయాలని ప్రిన్సిపల్ సివిల్ జడ్జి వెంకటేశ్వర్‌నాయక్ అన్నారు. శనివారం మానవ అక్రమ రవాణా నిర్మూలన ర్యాలీనిప్రారంభించారు. ఇందు కోసం స్వేచ్ఛ కోసం నడక కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్నట్లు తెలిపారు. ఎవరైనా మానక అక్రమ రవాణా చేస్తుంటే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. కార్యక్రమంలో గ్రామజ్యోతి సొసైటీ అధ్యక్షులు సుభద్ర, సీఐ చాంద్‌బాషా, హెచ్ఎం సుబ్బారెడ్డి, ఐసిడిఎస్ రమణమ్మ, బొజప్ప తదితరులు పాల్గొన్నారు.

కురబలకోట : మానవ అక్రమ రవాణా లేని సమాజాన్ని స్థాపించడమే అందరి లక్ష్యం కావాలని తహసీల్దారు తపస్విని కోరారు. కురబలకోటలో వాక్ ఫర్ ఫ్రీడమ్ కార్యక్రమ సందర్భంగా పోస్టర్లను ఆవిష్కరించారు. గ్రామ జ్యోతి సొసైటీ అధ్యక్షురాలు సుభద్ర అధ్యక్షతన పవిత్ర సేవా సంస్థ అధ్యక్షులు ఆర్. వేమనారాయణ సమిష్టి కృషితో వాక్ ఫర్ ఫ్రీడమ్ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

గురుకుల పాఠశాలను తనిఖీ చేసిన జడ్జి


గురుకుల పాఠశాలలో బియ్యాన్ని పరిశీలిస్తున్న జడ్జి అబ్రహం

మదనపల్లె : హైకోర్టు ఆదేశాల మేరకు పట్టణంలోని డాక్టర్.బీ.ఆర్.అంబేడ్కర్ గురుకుల పాఠశాలను, మదనపల్లె రెండో అదనపు జిల్లా జడ్జి అబ్రహం శనివారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. గురుకుల పాఠశాలలో విద్యార్థినులకు అందుతున్న మౌలికవసతులపై అడిగి తెలుసుకున్నారు. తరగతి గదులను, వంటశాలను, పరిసరాల పరిశుభ్రతను, స్నానాల గదులను పరిశీలించారు. బాలికలకు గురుకుల పాఠశాలలో ఉన్నటువంటి భద్రత, సౌకర్యాలను అడిగి తెలుసుకున్నారు. వసతి గృహాల్లో ఏమైనా సమస్యలుంటే తమ దృష్టికి తీసుకురావాలని సూచించారు. బాలికలను ఉద్దేశించి మాట్లాడుతూ...బాల్యవివాహాలు, గుడ్‌టచ్, బ్యాడ్ టచ్ తదితర విషయాలపై అవగాహన పెంచుకోవాలన్నారు. క్రమశిక్షణతో విద్యాబుద్ధులు నేర్చుకుని, బంగారు భవిష్యత్‌కు బాటలు వేసుకోవాలన్నారు. బాలలకు అందిస్తున్న ఆహారాన్ని, స్టోర్ రూమ్‌లో బియ్యం బస్తాలను పరిశీలించారు. కార్యక్రమంలో ఇన్‌చార్జ్ ప్రిన్సిపాల్ వసుంధరాదేవి, వైస్ ప్రిన్సిపాల్ శ్రీలత తదితరులు పాల్గొన్నారు.

అభ్యసన వైకల్యాలపై అవగాహన


అవగాహన కల్పిస్తున్న ఎంఈఓ పద్మావతి

నిమ్మనపల్లె : ప్రత్యేక ప్రతిభావంతుల్లోని నిర్దిష్ట అభ్యసన వైకల్యాలను అధిగమించడానికి స్థానిక భవిత కేంద్రం ఆధ్వర్యంలో అవగాహన ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథులుగా ఎంఈఓలు పద్మావతి, నారాయణలు హాజరయ్యారు. జిల్లా ఉన్నతాధికారుల ఆదేశాలతో శనివారం స్థానిక ఎమ్మార్సీ భవనంలోని భవిత కేంద్రంలో డిస్ లెక్సియా(చదవడంలో ఇబ్బందులు), డిస్ గ్రాఫియా (రాయడంలో ఇబ్బందులు) డిస్ ఫేసియా(మాటలు అర్థం చేసుకోవడంలో ఇబ్బందులు) డిస్ క్యాలిక్యులియా(అంకెలు గుర్తించడం, లెక్కలు చేయడంలో ఇబ్బందులు) లను నిర్దిష్ట అభ్యసన వైకల్యాలాలపై విద్యార్థుల తల్లిదండ్రులకు అవగాహన కల్పించారు.

పీలేరు రూరల్ : నిర్దిష్ట అభ్యసనా వైకల్యం (డిస్లెక్సియా)పై అవగాహన ర్యాలీ నిర్వహించారు. శనివారం స్థానిక జెడ్పీ మెయిన్ పాఠశాల నుంచి ర్యాలీ నిర్వహించారు. ఎంఈవో లోకేశ్వర్‌రెడ్డి మాట్లాడుతూ ప్రత్యేక అవసరాలు గల పిల్లలకు 21 రకాల వైకల్యాలు ఉంటాయని, అందులో డిస్లెక్సియా అనేది ఒక రకం వైకల్యమన్నారు. ఈ సమస్యతో బాధపడేవారిలో శారీక పెరుగుదల ఉంటుంది కానీ భాషను అర్థం చేసుకోవడంలో ఇబ్బందులు పడుతారన్నారు.

మదనపల్లెలో పచ్చదనం పెంపునకు కృషి

మదనపల్లె : పట్టణంలో పచ్చదనాన్ని పెంపొందించి, పర్యావరణాన్ని పరిరక్షించే దిశగా చర్యలు తీసుకుంటున్నట్లు ఎమ్మెల్యే షాజహాన్‌బాషా తెలిపారు. శనివారం శేష్‌మహల్ థియేటర్ సమీపంలో మున్సిపల్ కమిషనర్ ప్రమీల ఆధ్వర్యంలో మొక్కలు నాటి నీరు పోశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ....పట్టణంలో రోజురోజుకీ పెరిగిపోతున్న వాతావరణ కాలుష్యాన్ని నివారించేందుకు పచ్చదనాన్ని పెంపొందించేందుకు నిర్ణయించామన్నారు. అందులో భాగంగా 50వేల మొక్కలను నాటేందుకు నిర్ణయించుకుని, శని, ఆదివారాల్లో మొక్కలు నాటే కార్యక్రమం చేస్తున్నామన్నారు. పట్టణ ప్రజలు పర్యావరణ పరిరక్షణను బాధ్యతగా తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు ప్రశాంత్, తాళ్లగిరి, గంగారపు వీస్ తదితరులు పాల్గొన్నారు.